విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 16, డిసెంబర్ 2023

నవాబు కోటలో నసీబు ఎవరిదో..!

సమరానికి సై అంటున్న సమవుజ్జీలు
తుది పోరులో గెలుపు ఎవరిదో..!
సంక్షేమం, అభివృద్ధి అంటున్న కాటసాని
ప్రభుత్వ వైఫల్యం అంటున్న బీసీ

విశాలాంధ్ర–అవుకు: నంద్యాల జిల్లా నంద్యాల పార్లమెంటు పరిధిలోని బనగానపల్లె నియోజకవర్గంలో వైసిపి తరఫున ప్రస్తుత శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి, తెలుగుదేశం పార్టీ తరఫున మాజీ శాసనసభ్యుడు బీసీ జనార్దన్ రెడ్డి లు తమదైన శైలిలో పార్టీ కార్యక్రమాలలో విస్తృతంగా పాల్గొం టున్నారు. 2024 ఎన్నికల సమరానికి సిద్ధమైన నాయకులు. తుది పోరిలో విజయం ఎవరిని వరిస్తుందోనని చర్చించు కుంటున్న నియోజకవర్గ ప్రజలు. నియోజకవర్గాల పునర్వి భజనలో భాగంగా 2009వ సంవత్సరంలో పాణ్యం నియో జక వర్గంలోని బనగానపల్లి, కోవెలకుంట్ల నియోజకవర్గం లోని కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల మండలాలతో కలిసి బనగానపల్లె నూతన నియోజకవర్గంగా ఏర్పడింది. బనగానపల్లె నియోజకవర్గానికి మొదటిసారిగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా చల్లా రామకృష్ణారెడ్డి, ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థిగా కాటసాని రామిరెడ్డి, తెలుగు దేశం పార్టీ అభ్యర్థిగా ఎర్రబోతుల వెంకటరెడ్డి పోటీ చేయగా కాటసాని రామిరెడ్డి ని విజయం వరించింది. అనంతరం ఆంధ్ర ప్రదేశ్ రెండు రాష్ట్రాలుగా ఏర్పడడం 2014లో జరి గిన ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థిగా బీసీ జనార్దన్‌రెడ్డి, వైసీపీ అభ్యర్థిగా కాటసాని రామిరెడ్డి పోటీ చేశారు. బనగాన పల్లె నియోజకవర్గం లో బలమైన ఓటు బ్యాంకు కలిగిన మాజీ శాసనసభ్యులు చల్లా రామకృష్ణారెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరడంతో ఆపార్టీ అభ్యర్థి బీసీ జనార్దన్ రెడ్డి విజ యం సాధించారు. అయితే బనగానపల్లె నియోజకవర్గం రాజకీయాల్లో జరిగిన అనూహ్య రాజకీయ పరిణామాల మధ్య చల్లా రామకృష్ణారెడ్డి, మాజీ శాసనసభ్యుడు బిజ్జం పార్థసారధి రెడ్డిలు వైఎస్ఆర్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి కాటసాని రామి రెడ్డి గెలుపులో చల్లా రామకృష్ణారెడ్డి,బిజ్జం పార్థసారధి రెడ్డి, ఎర్రబోతుల వెంకటరెడ్డిలు భాగస్వామ్యులు అయ్యారు. అనం తరం వైయస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి కావడం చల్లా రామకృష్ణారెడ్డి శాసన మండలి సభ్యులుగా ఎన్నిక కావడం, అనారోగ్యంతో అయన మృతి చెందగా ఆయన తనయుడు చల్లా భగీరథ్ రెడ్డి శాసనమండలి సభ్యుడిగా ఎన్నికయ్యారు. గత ఏడాది ఆయన కూడా అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ శాసనసభ్యుడు బిజ్జం పార్థసారథి రెడ్డి కూడా నియోజకవర్గంలో జరిగే పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. నాటి నుండి నేటి వరకు వైసిపి తరఫున ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డిలు నియోజకవర్గ అంతా తిరుగుతూ పార్టీ మరియు ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు అభివృద్ధి పనులే వైసిపి అభ్యర్థిని మరోసారి 2024 లో జరిగే ఎన్నికల్లో గెట్టెక్కిస్తాయని వైసీపీ శ్రేణులు భావిస్తున్నాయి. అయితే 2019లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలైన బీసీ జనార్దన్ రెడ్డి ఓటమిని సైతం లెక్కచేయక సమర్థవంతంగా ప్రతిపక్ష పాత్రను పోషిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలే తమ అభ్యర్థి గెలుపుకు అండగా ఉంటాయని తెలుగుదేశం పార్టీ భావిస్తోంది. గత ఎన్నికల్లో వైసిపి అభ్యర్థి గెలుపుకు అండగా నిలిచిన చల్లా రామకృష్ణారెడ్డి, చల్లా భగీరథ్ రెడ్డి, ఎర్రబోతుల వెంకటరెడ్డిలు మరణించగా, మాజీ శాసనసభ్యుడు బిజ్జం పార్థసారధి రెడ్డి నియోజకవర్గంలో జరిగే వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉండటంతో తెలుగుదేశంకు లాభిస్తుందని ఆ పార్టీ నాయకులు భావిస్తున్నారు. ఏది ఏమి జరిగినా బనగానపల్లె నియోజకవర్గం ప్రజలు ఏ పార్టీని ఆదరిస్తారో వేచి చూడాల్సిందే.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి- సీపీఐ

రూ: 50 లక్షలు ఎక్స్ గ్రేషియా చెల్లించాలి
ఆత్మహత్య చేసుకున్న కుటుంబానికి పరామర్శ

విశాలాంధ్ర –మిడుతూరు : వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు పండక అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచని పరి స్థితుల్లో ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు ఎం రమేష్ బాబు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కలమందల పాడు గ్రామంలో ఆత్మహత్య చేసుకున్న మహమ్మద్ రఫీ రైతు కుటుంబ సభ్యులను సీపీఐ జిల్లా నాయకులు పరామర్శిం చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మహత్య చేసు కున్న మహమ్మద్ రఫీ రైతు కుటుంబం చాలా పేదరికంతో కూడుకున్నదని ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారని భార్య అంగన్వాడీ కార్యకర్తగా పని చేస్తూ కుటుంబ పోషణ గడుపుతున్నారని, అంతేకాక పొలాన్ని కౌలుకు తీసుకొని రైతు అప్పుల పాలు అయ్యాడని. తక్షణమే జిల్లా కలెక్టర్ స్పం దించి రైతు కుటుంబానికి రూ. 50లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లిం చి రైతు కుటుంబాని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుటుంబంలో యజమాని మృతి చెందడంతో కు టుంబ సభ్యులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని వారిని ఆదు కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమం లో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో అలరించిన అష్టావధానం

విశాలాంధ్ర– కొలిమిగుండ్ల: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాలలో)శుక్రవారం అష్టావధాన కార్యక్రమంను అట్టహాసంగా నిర్వ హించారు. మండల విద్యాధికారులు రాజయ్య, అబ్దుల్ కలాం సహాయ సహకారాలతో ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ కవి శ్రీ వైష్ణవ వెంకటరమణమూర్తి అధ్యక్షతన ప్రముఖ శతావధాని ఆముదాల మురళిచే అష్టావధానంను అద్భుతంగా నిర్వహించారు. గంగుల నాగరాజు ద్వారా నిషిదాక్షరి, సురేష్‌బాబు చే సమస్యాపూరణం, ప్రసాద్ చే దత్తపది, వైవిఎస్ నారాయణ రెడ్డి చే పురాణ పఠనం, చెన్నకేశవులచే వర్ణన, రమణయ్యచే అశువు, బాల ఓబన్నచే న్యస్తక్షరి, గుర్రప్పతో అప్రస్తు త ప్రశంస లతో నిర్వహించారు. విద్యార్థులు ఆహుతులు ఎంతో అలరించారు. ఇలాంటి సాహితీ కార్యక్రమాలు మోడల్ స్కూల్ నందు నిర్వహించడం పై పలువురు హర్షిస్తున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పలువురిని అధ్యాపక బృందం సన్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాముడు, చంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లి కంటే మిన్నగా సేవ చేస్తున్నా కనికరం లేదా..!

మద్దతుగా నిలిచిన ఏఐటీయూసీ, టీడీపీ, సీపీఎం, ప్రజాసంఘాల నేతలు

ఆత్మకూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎన్.రంగనాయుడు

ఉయ్యాలవాడ : మోకాళ్లపై నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

డోన్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

విశాలాంధ్ర –నెట్ వర్క్ : రాష్ట్రవ్యాప్తంగా ఉన్నటువంటి అంగన్వాడీకేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్నటు వంటి అంగన్వాడీలు తల్లి కన్నా మిన్నగా పిల్లలు, గర్భవతులు, బాలింతలకు సేవలందిస్తున్నప్పటికీ వైసీపీ ప్రభుత్వానికి కనీసం చీమ కుట్టినట్లు కూడా లేదని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన ఉద్యమానికి సీపీఐ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యా లయంలో వారు మాట్లాడారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ సీఎం జగన్ గత ఎన్నికల ప్రచారంలో తెలంగాణ కంటే రూ.1000 అధనంగా ఇస్తానన్న హామీని అంగన్వాడీ కార్మికులకు ఎందుకు అమలు చేయడం లేదని సూటిగా ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం గ్రాడ్యుటీని అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎప్పుడో 2019లో పోరాటాల ఫలితంగా పెంచిన వేతనాలని ఈ ప్రభుత్వం మేం పెంచమని గొప్పలు చెప్పుకుంటూ ప్రచారం చేస్తుందని ఎద్దేవా చేశారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న అంగన్వాడీ కార్మికుల ఉద్యమాన్ని అక్రమంగా దౌర్జ న్యంగా అణచి వేయాలని చూస్తే చూస్తూ ఊరుకోమన్నారు. అక్రమ నిర్బంధాలు,దౌర్జన్యంతో కార్మికుల ఉద్యమాన్ని అణచి వేయడం తగదన్నారు. అంగన్వాడీ కార్మికుల ఉద్యమానికి సంపూర్ణంగా మద్దతు తెలుపుతున్నామని వారు తెలిపారు. నాడు మాట తప్పని, మడమ తిప్పని నేత నని ప్రగల్భాలు పలికిన సీఎం జగన్ మోహన్ రెడ్డి నేడు ఎందుకు కట్టు బడి ఉండటం లేదని వారు సూటిగా ప్రశ్నించారు.

ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ, టీడీపీ, సీపీఎం, ప్రజా సంఘాలు అంగన్వాడీలు నిర్వహిస్తున్న సమ్మె ప్రాంతాలకు స్వచ్ఛందంగా తరలివచ్చి సంపూర్ణ మద్దతు తెలపడం అభినందనీయ మన్నారు. సమావేశంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం.రమేష్‌బాబు, సీపీఐ తాలుకా నాయకులు ప్రసాదు ప్రతాప్ వెంకట శివుడు, అహమ్మద్ హుసైన్ యేసేపు తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డ : మద్దతుగా కూర్చున్న మాజీమంత్రి

అధికారిణికి వినతిపత్రం అందజేస్తూ..

దీక్షా శిబిరంలో అంగన్వాడీలు

కోవెలకుంట్ల : దీక్షా శిబిరంలో మద్దతుతెలుపుతూ..

వెలుగోడు :మాట్లాడుతున్న నేతలు

మాట్లాడుతున్న ఏరాసు

కొలిమిగుండ్ల: అధికారికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి రమేష్

నేడే అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

విశాలాంధ్ర– నంద్యాల రూరల్ : రాజ్యాంగ సృష్టికర్త అయిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ వివిధ ప్రజా సంఘాల ఆధ్వ ర్యంలోపెద్దకొట్టాలలో శనివారం విగ్రహావిష్కరణ నిర్వహిస్తున్నట్లు మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ప్రజా సంఘాల ఐక్య వేదిక కన్వీనర్, మండల అధ్యక్షులు మేకల.లింగస్వామిలు తెలిపారు. అంబేద్కర్ విగ్రహావిష్కరణకు రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టరీ ప్రసాద్, జాతీయ మాల మహానాడు అధ్యక్షులు చెన్నయ్యలతో పాటు ముఖ్య అతి థులుగా ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీఇషాక్ బాషాలు పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

సత్తా చాటిన క్రీడాకారులు

విశాలాంధ్ర – ఆళ్లగడ్డ : పట్టణంలోని కెవి సుబ్బారెడ్డి డిగ్రీ కళాశాల విద్యార్థు లు ఈనెల 14న కర్నూల్లోని ఆర్‌యు క్యాంపస్‌లో నిర్వహించిన అథ్లెటిక్స్ ఎంపిక పోటీలలో కె.వి సుబ్బారెడ్డి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ శ్రీనాథ్‌రెడ్డి, డైరెక్టర్లు భూమా శ్రీనివాసరెడ్డి, ఓబన్నలు మాట్లా డుతూఈనెల14న జరిగిన పురుషులు అథ్లెటిక్స్ త్రో విభాగం పోటీలలో మూడో సంవత్సరం డిగ్రీవిద్యార్థి హరీష్ మూడోస్థానం, షాట్‌పుట్‌లో మొదటిస్థానం సాధించారన్నారు.జావెలిన్ త్రోలో కిరణ్ కుమార్ రెండవ స్థానం సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు ఫిజికల్ డైరెక్టర్ మహబూబ్ భాషను అభినందించారు. ప్రతి విద్యార్థి తనలో ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసి ఆళ్లగడ్డకు మరియు కళాశాలకు పేరు ప్రతిష్టలు తీసుకొని రావాలన్నారు.

జ్యోతి విద్యానికేతన్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర– కోవెలకుంట్ల :మండల కేంద్రమైన కోవెలకుంట్ల జ్యోతి విద్యా నికేతన్ వి ద్యార్థులు విజ్ఞాన్ మేనతోన్ టాలెం ట్ టెస్ట్‌లో అక్టో బర్ 29,30 తేదీల్లో జరిగిన ఆన్ లైన్‌టాలెంట్ టెస్టులు జ్యోతి స్కూల్ విద్యార్థులు 135 మంది పాల్గొన్నారు అందులో 14 మంది స్టేట్ లెవెల్ టాలెంట్ టెస్ట్ కు ఎంపికైనారు. వారు ఈనెల 17న రాజమండ్రిలో జరగనున్న స్టేట్ లెవెల్ టాలెంట్ టెస్ట్‌కు వెళ్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం స్కూల్ యాజమాన్యం కరెస్పాండెంట్ ఎం.సవిత్నాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ సింధూరి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

నియోజకవర్గ అభివృద్ధే తమ ధ్యేయం

విశాలాంధ్ర–ఆళ్లగడ్డ : నియోజకవర్గ అభివృద్ధే తమధ్యేయమని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నా రు. గడపగడపకు మన ప్ర భుత్వంలో భాగంగా శుక్రవా రం ఓబులంపల్లె గ్రామంలో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇం టింటికి తిరిగి వైసీపీ ప్రభు త్వం హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలకు వివరిం చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, మరింత అభివృద్ధి చేస్తామన్నారు.సీఎం జగన్మోహన్‌రెడ్డి పాద యాత్రలో ఇచ్చిన హామీలు నెరవేర్చారన్నారు. అభివృద్ధి,సంక్షేమంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. సమా వేశంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బుడగ జంగాల సమస్యలు పరిష్కరిస్తాం

విశాలాంధ్ర – నంద్యాల : బుడగ జంగాల సమస్యలు పరిష్కరిస్తామని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ నంద్యాల ఇన్‌చార్జ్ ఎన్ఎండి ఫరూక్ హామీ ఇచ్చారు. బెడ, బుడగ జంగల నాయకులు తాటికొండ బుగ్గ రాముడు ఆధ్వర్యంలో బుడగ జంగం కులస్తులు టిడిపి ఇంచార్జ్ ఫరూక్ ను కలిసి తమ సమస్యలు విన్నవించారు. ఈ సందర్భంగా ఫరూక్ మాట్లాడుతూ నాటి నుండి సంచార జాతులైన బేడ బుడగ జంగాలు కూడు, గూడు, గుడ్డ కోసం కళను నమ్ముకుని దేశ వ్యాప్తంగా తిరిగి బుర్రకథలు చెప్పే రోజులు ఇప్పటికీ గుర్తున్నాయన్నారు. జగన్ పాదయాత్ర సాక్షిగా బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేరుస్తామని మాట ఇచ్చి మోసం చేశారని, వారికి ఎటువంటి సంక్షేమ పథకాలు అమలు చేయలేదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే బుడగ జంగం కులస్తులకు ఎస్సీజాబితాలో చేర్చేందుకు జెసి శర్మ కమిషన్ ఇచ్చిన నివేదికను ఆమోదించి, కేంద్రానికి పంపే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమావేశంలో పెద్ద సంఖ్యలో బేడ బుడగ జంగాలు నాయకులు మోతే జమ్మడక్క, ముగ్గ సుంకన్న, మీసాల పుల్లయ్య, సురేష్, మహేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు వృధాను అరికడదాం..!

విశాలాంధ్ర –బనగాన పల్లె: విద్యుత్ విలువైె నది వృధా కాకుండా అందరం కలిసి అరి క ట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని వి ద్యుత్ శాఖ అధికారులు డి ఈ ఈ ఎన్ మదిలేటి, ఏఈ శ్రీని వా సులు పేర్కొన్నారు. బనగానపల్లె పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో నేటి సత్ సంకల్పం రేపటి వెలుగుల సాకారం.. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా విద్యుత్ అధికారులు ఎన్ మదిలేటి శ్రీనివా సులు విద్యుత్ వినియోగదారులకు అవగాహన కల్పిం చారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ కాంట్రాక్టర్ కంబగిరి విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుద్యోగులను నిండా ముంచిన జగన్ సర్కార్- ఏఐవైఎఫ్

విశాలాంధ్ర – నంద్యాల: నిరుద్యోగులను జగన్ సర్కార్ నిండా ముంచిందని ఏఐ వైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులునాగరాముడు ఆరోపించారు. స్థానిక సీపీఐ కార్యాల యంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి, యువజన సంఘాల సమావేశం నిర్వ హించారు.నాగరాముడు, పిడిఎస్యు జిల్లా అధ్యక్షులు రఫీ, డివైఎఫ్ఐ పట్టణ కార్య దర్శి శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎరిసామి, పివైఎల్ పట్టణ కన్వీ నర్ ఆనంద్, జీవీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షులు రవీంద్ర నాయక్, డీఎస్ వైఏ రాష్ట్ర అధ్యక్షులు షేక్ రియాజ్‌లు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ప్రస్తుతం గ్రూప్ 1, గ్రూప్ 2 నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నికలు దగ్గర పడుతున్న సమ యంలో ఉద్యోగాల పేరుతో డ్రామా ఆడుతుందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి దాదాపు నాలుగున్నర సంవత్సరాలు కావస్తున్నా నోటిఫికేషన్ ఎందుకు విడుదల చేయలేదని నిలదీశారు. ఈ 5 సంవత్సరాల కాలయాపన చేసి ఇప్పుడు ఎన్నికల ముందు జాబ్ నోటిఫికేషన్ హడావుడిగా విడుదల చేసి ఓట్ల రాజ కీయలు చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని మెగా డిఎస్సి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విద్యార్థి యువజన సంఘాల నాయకులు హరినాయక్, బాలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల కళ్లలో ఆనందం నింపడమే సీఎం లక్ష్యం



విశాలాంధ్ర–పాణ్యం: సొంతంగా సాగు భూమి లేకుండా గత కొన్నేళ్లుగా అసైన్డ్ భూముల్లో పంటలు చేసుకుంటూ జీవ నం సాగిస్తున్న నిరుపేదల కళ్లలో ఆ నందం నింపడమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే కాట సాని రాంభూపాల్ రెడ్డి పేర్కొన్నా రు. మండల కేంద్రంలోని శ్రీకృష్ణ దేవా లయ ఫంక్షన్ హాల్‌లో 14 గ్రామాల పరిధిలోని 687 మంది పేద రైతుల చేతుల్లో అనుభవంలోని 1,207 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలను శుక్రవారం ఎమ్మెల్యే కాటసాని చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ కొన్నేళ్లుగా అసైన్డ్ భూములలో సాగు చేసుకుంటున్న పేద రైతులకు సీఎం జగన్మోహన్ రెడ్డి అసైన్డ్ కమిటీ పేరుతో అలాంటి వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరగడం హర్షించదగ్గ విషయమన్నారు. రైతు భరోసా కేంద్రాలతో రైతులకు నాణ్యమైన ఎరువులు రాయితీ ధరలకే అందిస్తుందని గుర్తు చేశారు. ప్రకృతి విపత్తులతో పంటలను నష్టపోయిన ప్రతి రైతుకు సీఎం నేడు అండగా నిలిచి వారికి సాయంఅందించడం జరుగుతుందన్నారు. 2003కు ముందు అసైన్డ్ చేసిన భూములకు ప్రస్తుత ప్రభుత్వం పూర్తి యాజమాన్య హక్కులతో కూడిన పట్టాలు పంపిణీ చేసిందని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులుగౌడ్, ఎంపీపీ హుస్సేన్‌బి, వైస్ ఎంపీపీ వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, సర్పంచ్ మేకల పల్లవి, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ కార్యాలయంలో విద్యుత్ మీటర్‌ను అక్రమంగా తొలగించిన విద్యుత్ అధికారులు



విశాలాంధ్ర –నంద్యాల : నంద్యాల పట్ట ణంలోని ప్రజాసంఘాల కార్యాలయం లో రెండు నెలలు విద్యుత్ బిల్లులు కట్టలేదని విద్యుత్ అధికారులు ఏకంగా మీటర్ ను తొలగించి తీసుకుపోవడాన్ని వ్యతిరేకించి సీపీఐ కార్యాలయంలో సీపీ ఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరి గిందని సీపీఐ పట్టణ కార్యదర్శి కె.ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు నాగ రాముడు, పట్టణ సహాయ కార్యదర్శి సోమన్న, ఏఐటీయూసీ పట్టణ అధ్య క్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయ కులు వెర్రిస్వామి, నాయకులు సుశీలమ్మ,అబ్దుల్లా తెలిపారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయ నాయకుల ఇళ్లలో, ఫ్యాక్టరీలలో లక్షల కొద్ది బిల్లులు పేరుకుపోయినా వారిని అడిగే దమ్ము లేదని, నిరం తరం ప్రజా సమస్యలపై పోరాడే సీపీఐ కార్యాలయంలో రెండు, మూడు నెలలు విద్యుత్ బిల్లులు చెల్లించకపోతే సమాచారం కూడా ఇవ్వకుండా ఏకంగా మీటర్లను తొలగించి తీసుకోవడం దుర్మార్గమన్నారు. బిల్లులు కట్ట క పోతే కరెంటు కట్ చేయాలి కాని ఏకంగా డబ్బులు చెల్లించిన మీటర్ బోర్డులను ఎందుకు తీసుకుపోతారని ప్రశ్నించారు. ఏది ఏమైనా ఇలాంటి చర్యలు విద్యుత్తు అధికారులు మానుకోవాలని లేనియెడల ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ ఆకస్మిక మృతి-ఎస్టీయూ

విశాలాంధ్ర–ప్యాపిలి : ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు మరియు ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ అయిన షేక్ సాబ్జి రోడ్డు ప్రమాదంలో ఆకస్మిక మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించిందని ఎస్టీ యూ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ నాయక్, ఎస్టీయూ మండల నాయకులు చంద్రమౌళి,చిన్నపరెడ్డి, హాజీ మస్తాన్‌వలి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవా రం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో నాయకులు సమావేశమై షేక్ సాబ్జి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ విద్యా ఉద్యోగ ఉపాధ్యాయ రంగాలకు షేక్ సాబ్జి చేసిన సేవలు, ఉద్యమాలు నిర్వహించారన్నారు. అంగన్వాడి ఉద్యమానికి హాజరై తిరిగు ప్రయాణంలో పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడు ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతి చెందడం మాకు తీరని లోటని వారన్నారు. షేక్ సాబ్జి మృతి పట్ల ఎస్టీయూ మండల నాయకులు సంతాపం ప్రకటిస్తూ ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.సమావేశంలో ఎస్టీయూ నాయకులు చిన్నప రెడ్డి,మనోహర్, శేషనాయక్, చంద్రబాబు, ఇందిరమ్మలు పాల్గొన్నారు.

రూ.2 లక్షలు విలువైన గుట్కా..మద్యం పట్టివేత

విశాలాంధ్ర– బనగానపల్లె: వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.2 లక్షల విలువైన గుట్కా, కర్ణాటక మద్యం సీ సాలు లభ్యమైనట్లు ఎస్సై రామాను జన్‌రెడ్డి తెలిపారు. ఎస్సై మాట్లాడుతూ బనగానపల్లె సర్కిల్ పరిధిలోని నంది వర్గం పరిధిలోని కైప గ్రామ సమీపం లో ఉదయం వాహనాలు తనిఖీ చేస్తు న్న సమయంలో రూ.2 లక్షల విలువ చేసే గుట్కా, మద్యం సీసాలు కారులో తరలిస్తున్న బనగానపలకు చెందిన ఆరిఫ్ అనే వ్యక్తిని అదుపులో తీసుకొని సరైన పత్రాలు లేనందున కేసు నమోదు చేసి కారును సీజ్ చేసి రిమాండ్‌కి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

మాజీ మంత్రిని కలిసిన జనసేన యువ నాయకుడు



విశాలాంధ్ర–ఆత్మకూరు రూరల్ : మాజీ న్యాయశాఖ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి స్వగృహంలో శుక్రవారం జనసేన యువ నాయకుడు అరుణ్ కుమార్‌కలిశారు. ఈసందర్భంగా వా రు మాట్లాడుతూ నియోజకవర్గంలో జనసేన - తెలుగుదేశం పార్టీ కలిసి ఎన్నికల సమయంలో ప్రచారం చేయడం విషయం గురించి చర్చించడం జరిగింది. పార్టీని ముందుకు తీసు కెళ్లడంపై చర్చించారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి



విశాలాంధ్ర –ఉయ్యాలవాడ: రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న 58వేల ఉపాధ్యాయ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలని నంద్యాల జిల్లా నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు దేవరాజు కోరారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ రవి కుమా ర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభు త్వం ప్రకటించిన జాబ్ కాలెండర్ ప్రకారం నిరుద్యోగ బిఈడి, టిటిసి అభ్య ర్థులకు ఉద్యోగ అవకాశం కల్పించి వారి జీవన విధానాన్ని మెరుగు పర చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంతోకాలం నుండి ఆశలు పెట్టు కుని ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డిని అభ్యర్థించారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 16,డిసెంబర్ 2023

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర – వెల్దుర్తి : పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మండల సమితి సమావేశ కార్యక్రమంలో భాగంగా సిపిఐ వెల్దుర్తి మండల పార్టీ కార్యదర్శి టీ. కృష్ణ,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే.జగన్నాథం మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన రైతు సంఘం జిల్లా మహాసభలు ఎమ్మిగనూరులోజరుగుతున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా తుఫాను వర్షం వల్ల నష్టపోయినటువంటి రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఎకరాకి 40 వేల రూపాయలు ఇవ్వాలని జిల్లాలో కరువు సహాయక చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని వారి డిమాండ్ చేశారు. ఈనెల 18వ తేదీలో ఎమ్మిగనూరులో జరిగే రైతు సంఘం జిల్లా మహాసభల్లో రైతుల సమస్యల గురించి చర్చించి ఉద్యమాలకు శ్రీకారం చుడతామని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి ఆటో యూనియన్ జిల్లా నాయకులు యేసయ్య,బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగమద్దయ్య,చిన్న వ్యాపారస్తుల సంఘం అధ్యక్షుడు అనిల్,సిపిఐ మండల నాయకులు డి రాజు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి చిన్నమాదులు,ఎల్లప్ప ,చిలిపి కృష్ణ, రైతు సంఘం నాయకులు బాలరాజు,వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు,అల్లు గుండు గ్రామనాయకులు, పాల్గొన్నారు.

జిల్లా మహాసభల జయప్రదంకై కరపత్రాలు పంపిణీ

విశాలాంధ్ర – పత్తికొండ : ఈనెల 18,19 తేదీలలో ఎమ్మిగనూ రులో జరిగే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం 10వ జిల్లా మహాసభ లను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ రైతు సంఘం నాయ కులు జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ పట్టణ ప్రధాన కూడళ్లలో కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షా బావ పరిస్థితుల దృష్ట్యా ఎన్నడూ లేని విధంగా తీవ్ర కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని, తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాలను అరికట్టాలని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. హంద్రీనీవా కింద ఉన్న కుడి, ఎడమ కాలువలను పూర్తిచేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు పైబడిన ప్రతి రైతుకు పదివేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలన్నారు. వచ్చే ఖరీఫ్ సీజన్ కి 90 శాతం సబ్సిడీతో ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా మహాసభలలో చర్చించి భవిష్యత్ పోరాటాలకు సన్నద్ధమవుతామని తెలిపారు. ఎమ్మిగనూరులో జరిగే జిల్లా మహాసభలకు రైతు సోదరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పెద్ద ఈరన్న, ఉమాపతి, సిపిఐ మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, రైతు సంఘం నాయకులు పులికొండ, కాశి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభల జయప్రదంకై జీపు జాత

విశాలాంధ్ర – పెద్దకడబూరు : 18,19 తేదీలలో ఎమ్మిగనూరులో జరుగు రైతు సంఘం 10వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్య వర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం తాలూకా కార్యదర్శి ఆంజనేయ పిలుపునిచ్చారు. శుక్రవారం జీపు జాత పెద్దకడబూరు మండలానికి చేరుకుంది. ఈ మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి. రామచంద్రయ్య, ప్రధాన కార్యదర్శి కె. వి. వి. ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు లక్ష్మి రెడ్డి, జిల్లా కార్యదర్శి జగన్నాథం, సిపిఐ కార్య వర్గ సభ్యులు భాస్కర్ యాదవ్, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి రంగన్న లు హాజరవుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలచంద్ర,రామాంజనేయులు, ఎర్రిజేలు , అంజినయ్య, దస్తగిరి, పేతురు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కోసిగి : సిపిఐ అనుబంధ సంస్థైన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పదవ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ తాలూకా అధ్యక్షులు భాస్కర్ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నందు మండల కార్యదర్శి గోపాల్ , సహాయ కార్యదర్శి ఓంకార స్వామి అధ్యక్షతన జీపు జాత కార్యక్రమం నిర్వహించారు.

మత్స్య కార్మికుల ఉపాధిని ప్రోత్సాహించాలి

విశాలాంధ్ర – నందవరం : సంప్రదాయంగా వృత్తిని కొనసాగిస్తున్న మత్స్య కార్మికుల ఉపాధిని దెబ్బతీసే ఆర్థిక విధానాలను అమలు చేస్తున్న కేంద్రంలో నరేంద్ర మోడీ,రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి,మత్స్య కార్మిక వృత్తి విధానాలకు వ్యతిరేకంగా వృత్తి పోరాటాల ద్వారా మత్స్య కార్మికులు ఉపాధిని కాపాడుకోవాలని, చేతివృత్తుల సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు పిలుపునిచ్చారు. శుక్రవారం నందవరంలో మత్స్య కార్మిక సంఘం నాయకులు విజయకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ మత్స్య కార్మిక సంఘం విస్తృత స్థాయి సమావేశానికి కే.రామాంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో అత్యంత పొడవైన సముద్రంలో ఎన్నో సంవత్సరంలోగా చేపలు పట్టుకొని జీవనం కొనసాగిస్తున్న మత్స్య కార్మికుల సాంప్రదాయ వేటను ప్రోత్సహించకపోవడంతో అవసరమైన సహాయం అందకపోవడంతో ప్రధాని నరేంద్ర మోడీ మిత్రుడైన ఆదాని వంటి కార్పొరేట్ సంస్థలకు ఆర్థిక విధానాల పేరుతో సముద్రంలో ఇసుకను తవ్వకపోవడం మొదలైన, బోట్లలో చేపలను విదేశాలకు భారీ ఎత్తున ఎగుమతి చేస్తున్నారని వాటి ద్వారా మస్త కార్మికులు పూర్తిగా నష్టపోతున్నారని వారు అన్నారు. మత్స్య కార్మికులను పూర్తిగా దెబ్బతీసే విధంగా ఈ ప్రభుత్వాలు ఉన్నాయని అన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.మత్స్య కార్మికుల జిల్లా సంఘం అధ్యక్షుడుగా విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా అడ్వకేట్ కే రంగనాథ్, ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గిడ్డయ్య, ఏపీ రైతు సంఘం తాలూకా కార్యదర్శి శాంతన్న,సిపిఐ నాయకులు మస్త కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

మార్పు కోసం ప్రజలు ఎదురు చూపు

విశాలాంధ్ర – దేవనకొండ : రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకుంటున్నరు ఎవరెన్ని చెప్పినా ఆలూరు నుండి నేను బరిలో ఉంటానని ఇక్కడ టీడీపీ జెండా ఎగురవేస్తానని ఆలూరు టిడిపి ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం ఆలూరులో వాసవి కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన తాలూక స్థాయి తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు చేపట్టిన ఆరు సంక్షేమ పతకాలును ప్రజల్లోకి తీసుకెళ్లాలని భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లి వారి కష్ట సుఖాలను పంచుకోవాలన్నారు. డబ్బులు సంపాదనకోసం పార్టీలోకి రాలేదు ప్రజలకు సేవ చేద్దామని వచ్చామని మంత్రి పదవులు కూడా వద్దనుకున్నామని అన్నారు. అనంతరం మాజీ జడ్పిటిసి మీనాక్షి నాయుడు, కన్వీనర్లు విజయ భాస్కర్ గౌడ్,అశోక్ యాదవ్ ,మాట్లాడుతూ వైఎస్ జగన్ను తక్కువ అంచనా వేయకూడదని అవసరమైతే డబ్బులు, దౌర్జన్యాలు చేసి అయినా గెలవడానికి సిద్ధం అవుతారని కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు మరో నాలుగు నెలలు కష్టపడితే విజయం మనదేనని అన్నారు.

భూ హక్కు రీసర్వే పొడిగించండి

విశాలాంధ్ర – హొళగుంద : మండలంలోని గజ్జహల్లిలో జరుగుతున్న జగనన్నభూ హక్కుభూ సురక్ష రీ సర్వే కార్యక్రమాన్ని పొడగించాలని మాజీ గజ్జహల్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు గజ్జెహల్లి హనుమంత రెడ్డి రైతులు శుక్రవారం జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.రైతులు సకాలంలో రాకపోవడంతో మండల అధికారులు రీ సర్వే పనులను కొనసాగిస్తున్నారని అధికారుల పత్తిడినీ తట్టుకోలేక అధికారులు రీ సర్వే పనులను త్వరగా ముగించడానికి పూనుకున్నారని అన్నారు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని రిసర్వే కార్యక్రమాన్ని పొడగిస్తే గ్రామంలోని అర్హులైన రైతులందరికీ అనుకూలమవుతుందని విజ్ఞప్తి చేశారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ

విశాలాంధ్ర – కర్నూలు లీగల్ : కర్నూల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగభూషణం నాయుడు ప్రధాన కార్యదర్శి ఎంవి చక్రపాణి ఆధ్వర్యంలో శుక్రవారం జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు ముక్తకంఠంతో ఈ నెల 29 వరకు విధులు బహిష్కరించి రిలే నిరాహార దీక్షలు కొనసాగించాలని తీర్మానం చేశారు. అనంతరం న్యాయవాదులు రిలే నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరుకున్నాయి.ఈ కార్యక్రమంలో నరసింహులు, శ్రీనివాసులు, రాము, కృష్ణమూర్తి,జగదీష్, పి.దస్తగిరి, జావిద్ భాష, సఫత్, లక్ష్మీనారాయణ, ఎం ఆర్ కృష్ణ,న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ హాస్టల్ లను ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర – దేవనకొండ : కరువు ప్రాంత విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను రద్దు చేసి,తక్షణమే ప్రత్యేక కరువు స్కాలర్ షిప్ ద్వారా 15,000 రూపాయలను ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.శరత్ కుమార్ డిమాండ్ చేశారు.శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి,అనంతరం ఆర్ఐ వెంకటేశ్వర్లు కు వినతిపత్రాన్ని అందజేశారు అనంతరం మాట్లాడుతూ కర్నూలు జిల్లా దేశంలోనే అత్యంత వెనకబడిన జిల్లా,నిత్యం కరువుకాటకాలతో సతమతమవుతున్న ప్రాంతమని అన్నారు. ఇలాంటి పరిస్థితులు ఏర్పడినప్పటికీ కూడా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, ఈ జిల్లాలోని పరిస్థితిలో దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు అన్ని రకాల ఫీజులను రద్దుచేసి, ప్రతి విద్యార్థికి ప్రత్యేక కరువు స్కాలర్షిప్ ద్వారా 15 వేల రూపాయలను ఇవ్వాలని, ఈ ప్రాంతంలో సీజనల్ లేదా ప్రత్యేక వసతి గృహాలను ఏర్పాటు చేయడం ద్వారా ఇలాంటి పరిస్థితులను రూపుమాపేందుకు దోహద పడుతుందన్నారు. కరువు ప్రాంతాల్లో నివారణ చర్యలు చేపట్టేంతవరకు ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నాలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు,భాస్కర్నాయకులు నరేష్,సురేంద్ర విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు ఉద్యమం మరింత విస్తరించాలి

- ఉధృతంగా స్వతంత్ర, సంయుక్త పోరాటాలు
- బలమైన సంఘ నిర్మాణంతోనే రాజకీయ లక్ష్యం సాకారం
- ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే పిలుపు
- కర్నూలులో ప్రారంభమైన ఆలిండియా కిసాన్ కౌన్సిల్ సమావేశాలు

విశాలాంధ్ర – బ్యూరో కర్నూలు : దేశంలో రైతు ఉద్యమం మరింతగా విస్తరించాలని అఖిలభారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే అన్నారు. రైతు సమస్యలపై సంఘం స్వతంత్ర, సంయుక్త ఉద్యమాలు ఉధృతం కావాలని పిలుపునిచ్చారు. బలమైన సంఘ నిర్మాణ లక్ష్యంతో పని చేయాలని కోరారు. పోరాటాల్లో కలిసొచ్చే రైతులను రాజకీయంగా మన వైపు మరల్చుకునేందుకు సమర్థవంతమైన ప్రచారం నిర్వహించాలని, వారిలో చైతన్యం కలిగించాలని ఉద్బోధించారు. 16 నుంచి మూడు రోజులపాటు ఇక్కడ జరిగే ఎఐకెఎస్ అలిండియా కౌన్సిల్ (ఎఐకెసి) సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. సమావేశాలు నిర్వహిస్తున్న సత్య ఇన్ రెసిడెన్సీ ప్రాంగణానికి ఇటీవల మరణించిన ఎఐకెఎస్ మాజీ నాయకులు, తమిళనాడు వామపక్ష ఉద్యమ సీనియర్ నేత ఎస్ శంకరయ్య నగర్ పేరు పెట్టారు. ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు అశోక్ ధావలే సంఘ పతాకావిష్కరణతో కౌన్సిల్ సమావేశాలు మొదలయ్యాయి. అనంతరం ధావలే అధ్యక్షోపన్యాసం చేశారు. కేరళ త్రిసూర్లో ఎఐకెఎస్ ఆలిండియా కాన్ఫరెన్స్ తర్వాత ఏడాదికి కౌన్సిల్ భేటీ కర్నూలులో జరుగుతోందన్నారు. ఈ కాలంలో రైతు ఉద్యమంలో పలు చారిత్రాత్మక ఘటనలు చోటు చేసుకున్నాయని వివరించారు. 'ఏప్రిల్ 5న ఢిల్లీ రామ్ లీలా మైదానంలో రైతులు, కార్మికుల సంయుక్త ర్యాలీ, ఆగస్టు 24న ఢిల్లీ తలకటోరా స్టేడియంలో రైతు, కార్మిక మహా సమ్మేళనం, నవంబర్ 26–28 తేదీల్లో అన్ని రాష్ట్ర కేంద్రాల్లో కార్మిక– కర్షక మహా ధర్నాలు రైతు ఉద్యమానికి ముఖ్యమైన మైలు రాళ్లు'గా చెప్పారు. తమిళనాడులో 1992 నుంచి 31 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగా నాడు వాచాతిలో గిరిజనులపై పాశవిక దాడికి కారకులైన ప్రభుత్వ యంత్రాంగానికి మద్రాస్ హైకోర్టు శిక్షలు వేసిందని, న్యాయం కోసం వామపక్ష, ప్రజాసంఘాల,అణగారిన వర్గాలపోరాట చారిత్రక విజయంగా అభివర్ణించారు.

సామ్రాజ్యవాదానికి వత్తాసు : అంతర్జాతీయంగా చూస్తే సామ్రాజ్యవాద దాష్టీకాలు పెరిగాయని ధావలే చెప్పారు. పాలస్తీనాపై ఇజ్రాయల్ చేస్తున్న సరమేధంలో రెండు నెలల్లో 20 వేల మంది చనిపోయారు. చనిపోయిన వారిలో సగం మంది పిల్లలు, మహిళలుండటం విషాదకరం, అమెరికా, ఇతర పశ్చిమదేశాల మద్దతుతోనే పాలస్తీనాపై ఇజ్రాయల్ భీకర దాడులకు దిగింది. ఇజ్రాయల్ ఏర్పడ్డాక ఇన్ని దశాబ్దాల్లో భారత్ పాలస్తీనా వైపు నిలబడింది. ప్రస్తుత మోడీ ప్రభుత్వం అమెరికా ప్రాపకం కోసం ఇజ్రాయల్కు మద్దతిస్తూ తటస్తంగా ఉన్నానంటోంది. కాగా ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు, నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ప్రజల నుంచి పెద్ద ఎత్తున ప్రతిఘటన ఎదురవుతోంది. ఇటీవ జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో మూడు చోట్ల బిజెపి గెలవడం ఆందోళనకరమని ధావలే అన్నారు. 'ఆర్ఎస్ఎస్, బిజెపి ఒక పథకం ప్రకారం హిందూత్వ ఓట్లను ఏకీకరణ చేశాయి. కులాలవారీగా సోషల్ ఇంజనీరింగ్కు పాల్పడ్డాయి. కాంగ్రెస్ ఒంటెత్తు పోకడ, ఫలితంగా ప్రతిపక్షాల మధ్య అనైక్యత ఓట్ల తొలగింపుల వంటి బిజెపి అధికారిక రిగ్గింగ్, మనీ–మీడియా పవర్, బిజెపి గెలుపునకు కారణం మిజోరంలో సుదీర్ఘంగా ఎన్డిఎలో ఉన్న ఎంఎన్ఎఫ్ ఓటమి, తెలంగాణలో కాంగ్రెస్ గెలుపు సంభవించాయి' అని విశ్లేషించారు. రాజస్థాన్లో రైతు ఉద్యమ ఫలితంగా సిపిఎం అభ్యర్థులకు చాలా చోట్ల గణనీయమైన ఓట్లు సాధించారని అభినందించారు.మిగతాచోట్ల లెఫ్ట్ ప్రోగ్రెస్ విచారకరంగా ఉ ందన్నారు. పదేళ్ల బిజెపి హయాంలో ప్రజలపై భారాలు పడ్డాయని, వ్యవసాయం సంక్షోభంలో పడిందని, రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని,అదానీ అంబానీలకు మోడీ సర్కారు దోచిపెడుతోందని, రాజ్యాంగం,లౌకిక, ప్రజాస్వామ్యం, వ్యవస్థల విధ్వంసం, ఫెడరలిజంపై, మీడియాపై దాడులు జరుగుతున్నాయని చెప్పారు. 'చివరికి న్యాయ వ్యవస్థ సైతం వివాదాస్పదమైంది. 370 ఆర్టికల్ రద్దుకు మద్దతుగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు సిగ్గుచేటు, మధుర దేవాలయంలో పురావస్తు అధ్యయనానికి యుపీ హైకోర్టు తాజా తీర్పు చట్ట వ్యతిరేకం' అని ధావలే అన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపిని, దాని మద్దతుదార్లను ఓడించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇండియా ఫోరం బలోపేతం కావాలని ఆకాంక్షించారు. ప్రారంభసభ వేదికపై ఎఐకెఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్, ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, ఆఫీస్ బేరర్లు, నాయకులు ఆశీనులయ్యారు. ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు ఎం విజయకుమార్ సంతాప తీర్మానం ప్రతిపాదించారు.

అంగన్వాడీల సమస్యలపై ఇంత నిర్లక్ష్యమా..?

విశాలాంధ్ర-పత్తికొండ: అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.రామచంద్రయ్య, జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య లు డిమాండ్ చేశారు. శుక్రవారం అంగన్వాడీల నాలుగవ రోజు నిరాహార దీక్షలకు సిపిఐ, ఏఐటీయూసీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనాలు పెంచాలని, తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నిరాహార దీక్షలు చేస్తుంటే సీఎం జగన్ అంగన్వాడీలను బెదిరిస్తూ, సచివాలయ ఉద్యోగుల ద్వారా సేవలు చేయించుకుంటామని చెప్పడం ఎంతవరకు సమంజసం అన్నారు. అంగన్వాడీల సమస్యలను పరిష్కరించేంతవరకు అంగన్వాడీలు చేస్తున్న ఉద్యమానికి తమ సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి డి. రాజా సాహెబ్, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి రంగన్న, దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు గురుదాస్, నాయకులు మాదన్న, రాజప్ప, నాగిరెడ్డి, ఉరుకుంద తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు సిటీ : అంగన్వాడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నగర కార్యదర్శి చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప,సిఐటియు జిల్లా కార్యదర్శి ఎం డి అంజిబాబు ఎస్ యు సి ఐ జిల్లా నాయకులు నాగన్న హరీష్ తేజోవతి మాట్లాడుతూ అంగన్వాడి ఉద్యోగుల సమ్మె 4వ రోజుకు చేరిన అంగనవాడి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించక పోగా అంగన్వాడీ సెంటర్ల తాళాలను పగలగొట్టాలని నిర్ణయించడం చాలా దుర్మార్గమైన చర్య అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. గతంలో జగన్ ఇచ్చిన హామీనే వారు అడుగుతున్నారని హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. అంగన్వాడి ఉద్యోగులకు కనీస వేతనం ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్య అని బియ్యబట్టారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడి ఉద్యోగులకు గ్రాడ్యుటీ చెల్లించాలని కోరారు. అంగన్వాడి ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరైంది కాదని ఈ రకమైన పద్ధతే కనక పాటిస్తే రాబోవు కాలంలో ప్రభుత్వం పడిపోక తప్పదని వారు హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వం జోక్యం చేసుకొని చర్చలు జరిపి వారికి సమస్యలు పరిష్కరించాలని లేదంటే అన్ని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని అన్నారు. సమ్మె చేస్తున్న అంగన్వాడీల పట్ల బొబ్బిలి శాసనసభ్యులు వెంకట అప్పల నాయుడు అంగన్వాడీలు బలిసి సమ్మె చేస్తున్నారని వ్యాఖ్యానించడం పట్ల తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ధర్నా చౌక్ దగ్గర నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం దగ్గర ధర్నా నిర్వహించి ప్రాజెక్టు డైరెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలో 250 సెంటర్లకు తాళాలు పగలగొట్టడం విచారకరమని ఈ విధానం మానుకోవాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాలదుర్గమ్మ చౌడేశ్వరి ఏఐటీయుసి నాయకులు రామాంజనేయులు సిఐటియు కార్యదర్శి నాగేశ్వరరావు మల్లన్నతదితరులు మాట్లాడం జరిగింది. కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్స్ యూనియన్ నాయకులు కామేశ్వరి బాలదుర్గమ్మ నాగమణి మహేశ్వరి చౌడేశ్వరి సునంద రాధిక తదితరులు పాల్గొన్నారు.

న్యాయస్థానం తీర్పుననుసరించి గ్రాట్యూటీ మంజూరు చేయాలి

ఆదోనిటౌన్: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అంగన్వాడీలకు గ్రాట్యూటీని మంజూరు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కే.అజయ్ బాబు, ఏపీ అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా సమితి సభ్యులు పి.జానకి, సిఐటియు నాయకులు మహానంద రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నాల్గవ రోజు సమ్మెలో భాగంగా సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షులు ఈరమ్మ, సిఐటియు నాయకులు వరలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు .అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కార్యాలయ పరిపాలన అధికారికి అందజేశారు.ఈ సమ్మెకు ఆదోని జనసేన నియోజకవర్గ ఇన్చార్జి ఎస్.మల్లప్ప, ఆదోని కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవిశెట్టి ప్రకాష్ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ మండల కార్యదర్శి ఎస్. సుదర్శన్, కల్లుబావిరాజు,ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ పట్టణ కార్యనిర్వాహక అధ్యక్షులు ఏ. విజయ్, ఏఐటియుసి పట్టణ అధ్యక్ష కార్యదర్శులు వై.టి. భీమేష్ బి.ఎంకన్న ఓ.బి. నాగరాజు ,షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం

చిప్పగిరి: రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలం అయిందని ఆలూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ కోట్ల సుజాతమ్మ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రమైన ఆలూరులో అంగన్వాడీల గత మూడు రోజులుగా న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మెకు దిగడం జరిగింది. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలంటూ సమ్మెకు పూర్తి మద్దతు ప్రకటించడం జరుగుతుందన్నారు.

కార్మికుల న్యాయమైన హక్కులు పరిష్కరించాలి

విశాలాంధ్ర – ఆదోని రూరల్ : అంగన్వాడి కేంద్రాలలో పనిచేసే టీచర్లు, ఆయాలు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి నీలకంటప్ప,కాంగ్రెస్ ఓబీసీ కోఆర్డినేటర్ రాష్ట్ర నాయకులు దేవిశెట్టి ప్రకాష్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు నాలుగవ రోజుకు చేరడంతో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు వారు చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఎం. ఎండి.నూర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి సాయినాథ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దేవిశెట్టి వీరేష్,అంగన్వాడి కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలు భారీ ర్యాలీ

వెల్దుర్తి : స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో నుండి పాత బస్టాండ్ డాక్టర్ బి.అంబేద్కర్ సర్కిల్ వరకు భారీగార్యాలీ నిర్వహిం చారు. కర్నూలు జిల్లా సిపిఐ నాయకులు జగన్నాథం అంగన్వాడి అండ్ హెల్పర్స్ ప్రభుత్వాన్ని పోరాటాన్ని గుర్తించి తగిన న్యాయం చేయాలని సిపిఐ పార్టీ వారి హక్కుల కోసం పోరాటం చేయాల్సి వస్తుంది ప్రభుత్వాన్ని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, సుజాత షబానా,సునీత,సరస్వతి, సిపిఐ పార్టీ నాయకులు టి.కృష్ణ,మాధవ కృష్ణ ,రాజు, బాలరాజు,అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు సీపీఐ సంఘీభావం

కోడుమూరు : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు సిపిఐ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు.శుక్రవారం స్థానిక సంత మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన అంగన్వాడీల దీక్ష శిబిరానికి సిపిఐ మండల కార్యదర్శి బి రాజు,వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ కార్యదర్శి శేషఫణి యాదవ్, సిపిఐ పార్టీ సీనియర్ నాయకులు బి మునిస్వామి తదితరులు చేరుకొని తమ సంఘీభావాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం డివిజన్ కార్యదర్శి గఫర్ మియా, సిఐటియూ నాయకులు మోహన్, సిఐటియు మండల కార్యదర్శి బజ్జీల వీరన్న,అంగన్వాడి నాయకులు సూలమ్మ,సువాసిని, విజయభారతి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి పతనం తప్పదు

అంగన్వాడీల ఆందోళన ఉద్ధృతం

- ▶▶తాహసీల్దార్ కార్యాలయం ముట్టడి
- ▶▶నాలుగు గంటలపాటు డోర్ లాక్
- ▶▶ఆలూరు సిఐ జోక్యంతో విరమణ

అంగన్వాడీలకు పోలీసులకు మధ్య తోపులాట


తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్వాడీలు

విశాలాంధ్ర – ఆస్పరి : అంగన్వాడీ టీచర్, హెల్పర్ల సమస్యలను పరిష్కరించే వరకు ఉద్యమం ఆపేదేలేదని, ప్రభుత్వం తమపట్ల మొండిగా వ్యవహరిస్తే ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి పతనం తప్పదని ఎదిరించేందుకు సిద్ధంగా ఉన్నామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రమీల, విజయలక్ష్మి,విమల, సరోజు మ్మ, జ్యోతి విజయకుమారి, మాబునిషా, ఈరమ్మలు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఆవరణంలో అంగన్వాడీల నాలుగో రోజు నిరసన దీక్షలు కొనసాగాయి.మాజీ ఎంపీపీ రత్నమ్మ భర్త మాజీ డైరెక్టర్ కృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో మండల టిడిపి నాయకులు, మాజీ ప్రజాప్రతి నిధులు అంగన్వాడీల ఆందోళనకు సంఘీభావం తెలిపి దీక్షలో పాల్గొన్నారు. అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొట్టాలని ప్రభుత్వం అధికారులపై ఒత్తిడి తేవడానికి ఖండిస్తూ... ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తాసిల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి విధుల్లో ఉన్న రెవెన్యూ అధికారులను బయటకు పంపించి డోర్ లాక్ చేసిన వ్యక్తం చేశారు. దాదాపుగా మధ్యాహ్నం ఒంటిగంట నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు రెవిన్యూ అధికారులను లోపలకు వెళ్ళనీయకుండా అడ్డుకున్నారు. సిపిఐ, ఏఐటియుసి, సిఐటియుసి నాయకులు నాగేంద్రయ్య, విరూపాక్షి, కృష్ణ మూర్తి, రంగన్న, రామాంజనేయులు అంగన్వాడీలకు మద్దతు తెలిపారు. సంఘటన విషయం తెలుసుకున్న ఎస్ఐ వరప్రసాద్ తన సిబ్బందితో కలసి ఎంత నచ్చజెప్పినా అంగన్వా డి హెల్పర్, టీచర్లు ససేమీరా అంటూ నిరాకరించారు. తాసిల్దార్ కుమార స్వామి వచ్చేంతవరకు విరబించబోమని భీష్మించారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆలూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తాసిల్దార్ కార్యాలయానికి చేరుకొని అంగన్వాడి టీచర్లు, హెల్పర్లు, ఏఐటియుసి,సిఐటియుసి నాయకులతో మాట్లాడి తాసిల్దార్ కార్యాలయం డోర్ ఓపెన్ చేయించి ముట్టడి కార్యక్రమాన్ని విరమింపచేశారు. వారు మాట్లాడుతూ తమను ప్రభుత్వం బెదిరించేం దుకు ప్రయత్నిస్తోందని వర్కర్లు, హెల్పర్లు మండిపడ్డారు. సమ్మె విరమించుకోకుంటే అంగన్వాడీ కేంద్రాల తాళాలు పగలగొడతామని అధికారులు బెదిరిస్తున్నారని మహిళలు పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు తమ ఉద్యమం ఆపేదేలేదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో తెలంగాణ కన్నా అంగన్వాడీ వర్కర్లకు వెయ్యి రూపాయలు అదనంగా చెల్లిస్తానని తెలిపి, యాప్లతో అంగన్వాడీ ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తున్నార న్నారు. ప్రభుత్వం ఎన్ని ఇబ్బందు లకు గురి చేసినా తమ డిమాండ్లను సాధించే వరకు తమ ఆందోళనను విరమించబోమని, ఎదిరించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకురాలు శ్రీదేవి,విమలమ్మ,నాగమణి,తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, శనివారం 16, డిసెంబర్ 2023

తడకనపల్లె వ్యక్తులపై అట్రాసిటీ కేసు నమోదు

విశాలాంధ్ర - కల్లూరు : మండల పరిధిలోని తడకనపల్లి గ్రామానికి చెందిన మల్లె పోగు జయమ్మ భర్త చిన్న లక్ష్మన్న వయసు ఫిర్యాది ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన షేక్ జుబేదాబి, షేక్ సలాం అల్లా అను ఇరువురిపై ఎస్సీ ,ఎస్టీ ,అట్రాసిటీ కేసు ఎస్సై నల్లప్ప తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న తడకనపల్లి గ్రామం, సచివాలయం దగ్గర కమ్యూనిటీ కోఆర్డినేటర్ కృష్ణుడు ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి పొదుపు మహిళ సంఘాల సమావేశాన్ని నిర్వహించిన కారణంగా, జుబేదాబి అను మహిళ తాను తడకనపల్లి సాయి మహిళా గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు నని, తన అనుమతి లేకుండా ఎలా నిర్వహిస్తారు అని, మహిళా సంఘాల సభ్యులకు నోటీసులు కూడా ఇవ్వలేదు అని కోఆర్డినేటర్ కృష్ణుడితో వాదనకు దిగి కృష్ణుడి, పక్కనే ఉన్న మల్లె పోగు జయమ్మ తో గొడవ పెట్టుకుని, ఈ సమావేశాన్ని నిర్వహించడానికి నువ్వే ప్రధాన కారణమని ఆమెతో గొడవ పెట్టుకుని జయమ్మ ని కొట్టి, దుర్భాషలాడి, కులం పేరుతో దూషించి అవమానించి, ఇదే విషయాన్ని సదరు జయమ్మ జుబేదాబి అక్క అయిన తడకనపల్లి గ్రామ సర్పంచ్ గారితో జుబేదాబిని మందలించమని చెప్పటానికి ప్రయత్నిస్తుండగా మరొకసారి జుబేదాబి ఆమె కొడుకు షేక్ సలాం అల్లా ఇరువురు కలిసి జయమ్మును కొట్టి, దుర్భాషలాడి, కులం పేరుతో తిట్టి అవమాన పరిచినరని మల్లెపోగు జయమ్మ ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా ఉలిందకొండ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర - ఆస్పరి : మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని జన విజ్ఞాన వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దామోదర్, ఎంఈఓ-2 తిరుమలరావు, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు నాగేంద్రయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి షాబీర్ భాష లు అన్నారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఏఐవైఎఫ్ మండల సమితి ఆధ్వర్యంలో ఏపీ పుటకలమారి మోడల్ స్కూల్లో మత్తు పదార్థాల భారీ నుండి నిన్ను నువ్వు కాపాడుకో - మత్తు పదార్థాలు వల్ల విద్యార్థులు చదువుకు దూరం అవుతారు అనే అంశంపై అవగాహన సదస్సు కార్యక్రమాన్ని ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ అధ్యక్షత నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరదాగా మొదలయ్యే అలవాటుతో చివరికి బానిసగా మారతారన్నారు. మత్తు పదార్థాలు వల్ల విద్యార్థులు చదువును దూరం చేసుకుంటూ తమ జీవితం నాశనం చేసుకుంటున్నారన్నారు. కావున ఈ టీనేజ్ వయసులో మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా ఎవరి మాటలు వినకుండా ప్రతి ఒక్కరూ ఏదో ఒక లక్ష్యం పెట్టుకొని దాని వైపు అడుగులు వేయాలని, సమాజం కోసం మన వంతు కృషి చేయాలని అన్నారు. ఈ సదస్సులో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సమిల, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు విరుపాక్షి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈశ్వర్, ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు, లక్ష్మన్న ఆర్గనైజింగ్ కార్యదర్శి రంగప్ప, రఘు, నాయకులు రంగన్న, యువరాజు, వీరేష్ లు పాల్గొన్నారు.

అంగన్వాడీల పట్ల ప్రభుత్వ అనుచిత వైఖరి విడనాడాలి

విశాలాంధ్ర - ఎమ్మిగనూరు : అంగన్వాడీల పట్ల ప్రభుత్వ అనుచిత వైఖరి విడనాడాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శులు బి.గోవర్ధనమ్మ ఎస్ నాగ లక్ష్మి కృష్ణవేణి శిరోమణి, సిఐటియు డివిజన్ కార్యదర్శి బి రాముడు, ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి వి తిమ్మరాజు, ఐఎఫ్‌టియు డివిజన్ కార్యదర్శి కే ప్రసాద్ డిమాండ్ చేశారు. నాలుగు రోజు సమ్మెలో భాగంగా ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు తాసిల్దార్ ఎంపీడీవో వినతి పత్రం అందజేశారు. పట్టణంలో గ్రామాల్లో అంగన్వాడి సెంటర్లను తాళాలు పగలగొట్టి స్వాధీన పరుచుకోవాలని ప్రభుత్వం ఎత్తుగడలు వేయడం సహేతుకమైన చర్య కాదన్నారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు తన పాదయాత్ర సమయంలో నా అంగన్వాడి అక్క చెల్లెమ్మలకు ప్రభుత్వం వచ్చిన వెంటనే తెలంగాణ కంటే వెయ్యి రూపాయల జీతం ఎక్కువగానే ఇస్తామని పేర్కొని ప్రభుత్వం నాలుగున్నర ఏండ్లు పూర్తయినప్పటికీ తమ డిమాండ్ల పరిష్కారం చూపకపోవడంతోనే సమ్మె నోటీసు ప్రభుత్వానికి ఇచ్చి సమ్మెలోకి వెళ్ళమన్నారు. సమస్యను పరిష్కరించకుండా నిర్బంధాలను పెడితే సహించేది లేదన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. నాలుగో రోజు సమ్మెకు టిడిపి కోట్లవర్గ నాయకులు కే ఆదన్న ఎం శివకుమార్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున పి ఓ డబ్ల్యు జిల్లా కార్యదర్శి మణెమ్మ, ముస్లిం వెల్ఫేర్ పార్టీ నాయకులు హకీమ్, జనసేన బృందం రవి, సిపిఐ ఎంఎల్ ఐ ఎఫ్ టి యు నాయకులు అనీఫ్, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శివలక్ష్మి పట్టణ అధ్యక్షులు కృష్ణవేణి విశాలాక్షి తమ సంపూర్ణ మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరమ్మ నీరజ శైలజ హేమలత త్రివేణి బసమ్మ వెంకటలక్ష్మి జయమ్మ ఈరమ్మ శంషాద్ బేగం 600 మంది పాల్గొన్నారు.

రైతు మహాసభలను జయప్రదం చేయండి

విశాలాంధ్ర -కోసిగి : సీపీఐ అనుబంధ సంస్థైన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పదవ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ తాలూకా అధ్యక్షులు భాస్కర్ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నందు మండల కార్యదర్శి గోపాల్ , సహాయ కార్యదర్శి ఓంకార స్వామి అధ్యక్షతన జీపు జాత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐనాయక్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దాలి

విశాలాంధ్ర - పెద్దకడబూరు : ప్రభుత్వ పాఠశాలలను, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దాలని మండల విద్యాధికారులు సువర్ణ సునియం, రామ్మూర్తి ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు.వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని నౌలేకల్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు రికార్డులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, పాఠ్య ప్రణాళిక, ఉపాధ్యాయుల డైరీ తదితర వాటిని తనిఖీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం తనిఖీ చేసి విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని వంట ఏజెన్సీలను ఆదేశించారు. ఇందులో ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ నామినేటెడ్ పదవికి ఎన్నిక

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు గుంతకల్ డివిజన్ కు చెందిన ఆదోని రైల్వే స్టేషన్ కు "స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ"సభ్యులుగా నామినేటెడ్ పదవులకు ఆదూరి విజయ్ కృష్ణ, జిందే సాయికుమార్,రమేష్ ఆచారి, చిల్లాలే దత్త,కునిగిరి లక్ష్మీకాంతలను నియమిస్తున్నట్లు ప్రభుత్వం శుక్రవారం జారీ చేసింది. ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ ఆదోని రైల్వే స్టేషన్ సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని, ప్రజలు ఆదోని పరిధిలోని ఏవైనా రైల్వేకు సంబంధించిన సమస్యలు ఉంటే తమను సంప్రదించాలన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం రైల్వే శాఖను అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తుందని రైల్వే స్టేషన్లో ఆధునికరించి ప్రయాణికుల కోసం సౌకర్యవంతంగా ఉండే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని చెప్పుకొచ్చారు. రైల్వే స్టేషన్ నామినేటెడ్ పదవి ఇచ్చినందుకు రైల్వే శాఖ కేంద్ర మంత్రిత్వ శాఖకు,రైల్వే కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పుకొచ్చారు.

ఏఆర్ కానిస్టేబుల్ పి.తిమ్మన్న హఠాన్మరణం

నేడు అధికారిక లాంఛనాలతో గోనెగండ్లలో అంత్యక్రియలు

విశాలాంధ్ర- కర్నూలు: కర్నూలు జిల్లాకు చెందిన ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్ పి తిమ్మన్న (నంబర్.177) కర్నూలులోని పెదపాడు రోడ్ లోని శ్రీనివాసనగర్‌లో శుక్రవారం ఉదయం తన స్వగృహంలో అస్వస్థతకు గురయ్యారు. తక్షణమే కుటుంబసభ్యులు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి అప్పటికే మరణించినట్టు ధ్రువీకరించారు. ప్రస్తుతం పత్తికొండ తాలూకా తుగ్గలి గ్రామానికి చెందిన తుగ్గలి నాగేంద్రకు పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్నారు.ఈయన కర్నూలు జిల్లా గోనెగండ్ల గ్రామానికి చెందినవారు. తిమ్మనకు భార్య, నలుగురు కుమార్తెలు ,ఒక కుమారుడు ఉన్నారు. ఇద్దరు కుమార్తెలకు పెళ్లిళ్లు కూడ చేశారు. తిమ్మన్న గారి స్వగ్రామమైన గోనెగండ్లలో శనివారం ఉదయం 10 గంటలకు అధికారిక లాంచనాలతో అంత్యక్రియలు జరగనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

ఉపాధి హామీ సీనియర్ మేటి మృతి

విశాలాంధ్ర - కల్లూరు : బొల్లవరం గ్రామానికి చెందిన బి.మాధవ స్వామి సీనియర్ మీటిగా విధులు నిర్వహిస్తూ ఉండేవాడని గత కొంత కాలంగా అనారోగ్యం గురై క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోల్పోలేక శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో గత కొన్ని సంవత్సరాలుగా సీనియర్ మీటిగా విధులు నిర్వహిస్తూ ఉపాధి పనులను ఎంతో చాకచక్యంగా ఉపాధి కూలీలకు కలిపిస్తూ అందరి మన్ననలు పొందేవారని ఆయనమృతి పట్లగ్రామంలోని నాయకులు, ఉపాధి కూలీలు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నట్లు వారిని అన్ని విధాల ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

గుండ్రేవులలో వరి పంట కోత ప్రయోగం



విశాలాంధ్ర - సి.బెళగల్ : మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామం నందు రైతులు పండించిన వరి పంట పొలములో శుక్రవారం పంట కోత ప్రయోగం వ్యవసాయ అధికారులునిర్వహించారు. గుండ్రేవుల గ్రామ రైతు హెచ్. వరలక్ష్మి పొలం నందు 5లి5 చుట్టుకొలతల ప్రకారం పంటకోత ప్రయోగాన్ని నిర్వహించగా 12. 390 గ్రాముల విత్తనం వచ్చిందని తెలిపారు.

ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి

విశాలాంధ్ర-బనగానపల్లె : బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి,తెలుగుదేశం పార్టీ నంద్యాల పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షుడు మాట్లాడుతూ 58 రోజులు నిరాహార దీక్ష చేసి ఆయన ప్రాణ త్యాగం చేసి మనకు రాష్ట్రాన్ని సాధించి పెట్టారని అలాగే మన తెలుగువారిని మద్రాస్ వాళ్లు చాలా చులకనగా చూసేవాళ్ళని అది సహించలేక తెలుగు వారికి సపరేటు రాష్ట్రం కావాలని నిరాహార దీక్ష చేపట్టడం జరిగింది అటువంటి మహనీయునికి రెండు తెలుగు రాష్ట్రాల కేంద్రాల యందు ప్రభుత్వం వారు శృతి వనాలు ఏర్పాటు చేసి ఆయనకు ప్రతి సంవత్సరం ఘనంగా జయంతి మరియు వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు.కార్యక్రమంలో టంగుటూరు సీనయ్య నాగేంద్ర రెడ్డి, బత్తుల భాస్కర్ రెడ్డి, కోశాధికారి ఖాదర్, కాసుల జంగంశెట్టి ,బచ్చు భాస్కర్, రామ్ గోపాల తదితరులు పాల్గొన్నారు,బిజెపి అసెంబ్లీ కన్వీనర్ బీవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.మండల ప్రెసిడెంట్ యాదగిరి, జిల్లా కౌన్సిల్ మెంబర్ శరత్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శివ కృష్ణ యాదవ్, జాహీద్ బిన్ మహమ్మద్, పాల్గొన్నారు. పట్టణంలోని పాత బస్టాండ్ సర్కిల్లో గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆర్యవైశ్యులు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు టంగుటూరి సీనయ్య, నంద్యాల జిల్లా మహిళా మండలి ఆర్య వైశ్య సభ్యురాలు గుండా సుప్రజ , ఆధ్వర్యంలో పూలమాలవేసి ఘన నివాళులర్పించారు.కార్యక్రమంలో నల్లగట్ల వెంకటేశ్వర్లు, కాసుల జంగలం శెట్టి పట్టణ ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

నందికొట్కూరు :అమరజీవి పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి వేడుకలు శుక్రవారం పట్టణంలోని స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద సిపిఐ ,ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రఘురాం మూర్తి ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న గురువయ్య మహాలక్ష్మమ్మ దంపతులకు జన్మించాడన్నారు. స్వాతంత్రోద్యమంలో ప్రముఖ పాత్ర వహించారని అంతేకాకుండా భాష ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుపై ముందుండి పోరాడి వ్యక్తి అని ఆయన అన్నారు .దేవాలయాల్లో హరిజనులకు ప్రవేశం కల్పించాలని ఆమరణ నిరాహార దీక్ష ప్రారంభించి క్విట్ ఇండియా ఉద్యమం మరియు ఉప్పు సత్యాగ్రహాల్లో పాల్గొని మూడుసార్లు జైలు శిక్ష అనుభవించాడన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు మద్రాస్ లో 1952 అక్టోబర్ 19న బులుసు సాంబమూర్తి గారి ఇంట్లో నిరాహార దీక్ష ప్రారంభించాడన్నారు.
ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు మహానంది ,వినోదు, వెంకటేష్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల: ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు 1952 అక్టోబర్ 19వ తేదీ నుండి డిసెంబర్ 15వ తేదీ వరకు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించిన ఘనత పొట్టి శ్రీరాములుదేనని ఎమ్మెల్సీ ఇసాక్ బాషా కొనియాడారు. పొట్టి శ్రీరాములు 71వ వర్ధంతి సందర్భంగా శుక్రవారం సంజీవనగర్ గేట్ కూడలిలో ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో పాటు జిల్లా రెవెన్యూ అధికారి బి. పుల్లయ్య, ఇతర నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇసాక్ బాషా మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజులు అకుంఠిత నిరాహార దీక్ష చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధిస్తూ అమరజీవి అయ్యారన్నారు. డిఆర్ఓ బి. పుల్లయ్య మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణకు మూలపురుషుడు అమరజీవి పొట్టి శ్రీరాములని, దేశభాషల సమున్నతికి బలిదానం గావించిన త్యాగమూర్తి, భాషా ప్రయుక్త రాష్ట్రాల అవతరణకు మూలపురుషుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పుర ప్రముఖులు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు విరివిగా ఋణాలు మంజూరు చేయండి- జాయింట్ కలెక్టర్ మౌర్య

విశాలాంధ్ర బ్యూరో - కర్నూలు : కౌలు రైతులకు విరివిగా ఋణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు..సమావేశంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, పాణ్యం శాసన సభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులకు సకాలంలో ఋణాలు మంజూరు చేసేలా వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు, బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంకర్లు ఋణాలు మంజూరు చేసే సమయంలో ఓరిజినల్ పట్టాదారు పాసు పుస్తకం లేకపోయినప్పటికీ ఎలక్ట్రానిక్ పాస్ బుక్ ఆధారంగా కూడా ఋణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎల్డిఎంను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. పశు సంవర్ధక శాఖకు సంబంధించిన మొబైల్ అంబులెన్సులను గ్రామాల్లో ఎక్కువ శాతం తిరిగేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధికారిని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు.పాణ్యం శాసనసభ్యులు కాటసాని రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ ఋణాల మంజూరులో చిన్నటేకూరులోని బ్యాంకులో పొదుపు సంఘాల నాయకులు చెబితేనే ఋణాలు మంజూరు చేసే అవకాశం ఉందని అలా కాకుండా పొదుపు సంఘాల సభ్యులు వెళ్ళినప్పుడు కూడా ఋణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎల్డిఎం ను కోరారు. అదే విధంగా రీసర్వేకు సంబంధించి రైతులకు వారి పంట పొలాల సర్వే పట్ల చాలా అపోహలు ఉన్నాయని వాటిని నివృత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ కోరగా, సదరు అంశం పై సమావేశం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పిఎల్.వరలక్ష్మి, ఏపిఎంఐపి పిడి ఉమాదేవి, సివిల్ సప్లైస్ డిఎం షర్మిల, పశు సంవర్ధక శాఖ అధికారి డా.రామచంద్రయ్య, కెడిసిసి బ్యాంకు సిఈఓ రామాంజనేయులు, ఎల్డిఎం రామచంద్రరావు, నాబార్డు డిడిఎం సుబ్బారెడ్డి, మార్కెటింగ్ ఏడి నారాయణమూర్తి, మార్క్ ఫెడ్ తదితర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలి

విశాలాంధ్ర - ఆదోని రూరల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన వాల్మీకి బోయలను రాబోయే శాసనసభ ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని కోరుతూ వాల్మీకి బోయ సంఘం నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ క్రాంతి నాయుడు, కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎల్లార్తి వాల్మీకి అర్జున్, యువజన సంఘం నాయకులు మహేష్ లు శుక్రవారం విజయవాడలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పురందేశ్వరి,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గిడుగు రుద్రరాజులను కలిసి కోరినట్లు విశాలాంధ్ర పత్రికకు వారు తెలియజేశారు. రాబోయే 2024 ఎన్నికల్లో వాల్మీకి బోయలకు రాజకీయంగా సముచిత న్యాయం కల్పించాలన్నారు. రాష్ట్రంలో 20 ఎమ్మెల్యే 3ఎంపీ టికెట్లను ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో వాల్మీకి బోయలు పడుతున్న ఇబ్బందులను మీరు పార్టీల రాష్ట్ర అధ్యక్షులకు వివరించినట్లు చెప్పుకొచ్చారు. బోయ వాల్మీకులను ఎస్టీలో చేర్పించే విధంగా కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. రాయలసీమ జిల్లాల్లో అత్యధికంగా జనాభా కలిగిన వాల్మీకి బోయలను ఎమ్మెల్యే ఎంపీలుగా పోటీ చేయడానికి అన్ని రాజకీయ పార్టీలు సహాయ సహకారాలు అందించాలని వినతిపత్రం అందించడం జరిగిందని చెప్పుకొచ్చారు. వాల్మీకి సంఘం నాయకులు కోరిన కోరికల మేరకు ఇరు పార్టీల అధ్యక్షులు సానుకూలంగా స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. వాల్మీకి బోయలు రాజకీయంగా ఎదిగేందుకు ఉత్సాహంతో ఉన్న వ్యక్తుల పేర్లను ఇవ్వాలని రాష్ట్ర పార్టీ నాయకులు వివరాలను కోరడం జరిగిందన్నారు.

మంత్రి జయరాంతోనే గ్రామాభివృద్ధి సాధ్యం

విశాలాంధ్ర - హెూళగుంద : మండల పరిధిలోని ఎల్లార్తిలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి జయరామ్ సహకారం తో గ్రామాభివృద్ధి జరిగిందని వైసీపీ యువ నాయకుడు దరగప్ప అన్నారు. మంత్రి జయరాం వారి సోదరులు సహాయ సహకారంతో గ్రామానికి ఎన్నో నిధులు కేటాయించారని అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందాయని కొనియాడారు. సర్పంచ్ కురువ చామండీశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం కన్నడ పాఠశాల నుండి కొళి రామలింగమ్మ ఇంటి వరకు సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. వర్షం వస్తే బడి పిల్లలు ప్రజలు తిరగలంటే ఇబ్బందిగా ఉండేది. మంత్రి జయరాం దృష్టికి వెళ్లగా 10లక్షలు రూపాయలు మంజూరు చేశారని అన్నారు.కార్యక్రమంలో వైసీపీ యువ నాయకుడు దరగప్ప 'ఎస్కే గిరి'రుద్రయ్య స్వామి,శంక్రప్ప, ఈరన్న,వంపా,శ్రీనివాస్ రెడ్డి దుర్గప్ప, శేషి ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే..



విశాలాంధ్ర - కల్లూరు : శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఎస్సై సోమ్లా నాయక్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం మండల పరిధిలోని సల్కాపురం, పర్ల, గోకులపాడు నాగలాపురం తదితర గ్రామాలకు చెందిన ప్రజలతో పోలీస్ స్టేషన్లో ఎస్సై మాట్లాడుతూ అక్రమ,ఇసుక,మద్యం, గ్రావెల్ తదితర ఇల్లీగల్ వ్యాపారాలకు పాల్పడితే కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపుతామన్నారు. సల్కాపురంలో లిక్కర్ విక్రయిస్తున్న దుకాణంపై దాడులు నిర్వహించి లిక్కర్ సీసాలను పట్టుకొని హెచ్చరికలు జారీ చేసినట్లు తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనతోపాటు స్థానిక పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మహబూబ్ బాషాను అభినందించిన ప్రిన్సిపాల్

విశాలాంధ్ర -బనగానపల్లె : అంతర్ కళాశాల పోటీలో మెడల్స్ సాధించిన విద్యార్థికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఐ స్వర్ణలతాదేవి అభినందించారు. రాయల సీమ విశ్వవిద్యాలయం వారు గురువారం అంతర్ కళాశాల పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న ఎస్ మహబూబ్ బాషా పాల్గొని షాట్ పుట్ విభాగం నందు సిల్వర్ మెడల్, జావలిన్ త్రో విభాగంలో బ్రాంచ్ మెడల్ సాధించడం జరిగింది. మెడల్స్ సాధించిన మహబూబ్‌బాషాకి కళాశాల ప్రిన్సిపల్ అభినందించారు. కార్యక్రమం లో కళాశాల వ్యాయామ అధ్యాపకురాలు వి.విజయ కుమారి పాల్గొన్నారు.

రాష్ట్ర చేనేత విభాగం వైసీపీ సెక్రటరీగా..



విశాలాంధ్ర - నంద్యాల : వైసీపీ రాష్ట్ర చేనేత విభాగం సెక్రెటరీగా నంద్యాల పట్టణానికి చెందిన మాజీ కౌన్సిలర్ భీమనపల్లె వెంకట సుబ్బయ్యను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్ను ప్రోత్సహించిన నంద్యాల వైఎస్ఆర్సిపి సమన్వయకర్త శిల్పా మోహన్ రెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే భీమనపల్లె వెంకటసుబ్బయ్య నంద్యాల జిల్లా పద్మశాలి సంఘ నాయకులుగా ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చేనేత విభాగం వైఎస్సారసీపీ కార్యదర్శిగా అహర్నిశలు చేనేతల అభివృద్ధికి కృషి చేస్తానని, తిరిగి వైకాపాను గెలిపించేందుకు, జగన్ ను ముఖ్యమంత్రిని చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ పదవి వచ్చినందుకు పలువురు పుర ప్రముఖులు, కౌన్సిలర్లు ఆయనకు అభినందనలు తెలిపారు.

కీళ్లమార్పిడి రివిజన్ ఆపరేషన్ విజయవంతం

విశాలాంధ్ర-నంద్యాల: నంద్యాలలోని సెవెన్ హిల్స్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్లో అత్యంత అరుదైన కీళ్లమార్పిడి రివిజన్ ఆపరేషన్ విజయవంతమై నట్లు ఆస్పత్రి ఎండీ మారుతీకుమార్, ఆర్థోపెడిక్ డాక్టర్ క్రాంతికిరణ్ తెలిపారు. సెవెన్ హిల్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ సత్యసాయి జిల్లా నల్లమాడ మండలం గోపేపల్లి గ్రామానికి చెందిన జి.కృష్ణారెడ్డి సుమారు ఎనిమిదేళ్ల క్రితం తిరుపతిలో తన రెండు మోకాళ్లకు కీళ్ల మార్పిడి ఆపరేషన్ చేయించుకున్నారని ప్రమాదవశాత్తూ ద్విచక్ర వాహనం నుంచి కిందపడటంతో కుడికాలికి గాయం కారణంగా విపరీతమైన ఇన్ఫెక్షన్ రావడంతో ఇన్ ప్లాంట్ తొలగించారన్నారు. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న కృష్ణారెడ్డిని వైసీపీ పుట్టపర్తి సమన్వయ కర్త సోమశేఖర్ రెడ్డి నంద్యాలలో సెవెన్ హిల్స్ ఆస్పత్రిని సంప్రదించమని చెప్పగా కాత్యాయిని సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో ఇంప్లాంట్ ఖర్చుతో అరుదైన కీళ్ల మార్పిడి రివిజన్ ఆపరేషన్ చేశామని వారు పేర్కొన్నారు. ఆపరేషన్ కు సహకరించిన జనరల్ మెడిసిన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, అనస్థీషియా డాక్టర్ మధుసూదన్ రెడ్డిని వైద్య బృందాన్ని ఎండి రెంటాల మారుతికుమార్ ప్రత్యేకంగా అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అనంత విద్యార్థులు



విశాలాంధ్ర-ఆళ్లగడ్డ : పట్టణంలోని అనంత కళాశాలకు చెందిన విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 13న ఆళ్లగడ్డ పట్టణంలో నిర్వహించిన జూనియర్ టార్గెట్ బాల్ జిల్లా జట్టు ఎంపిక పోటీలలో అనంత కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం జరిగింది. అండర్ 19 బాలుర విభాగంలో సాదిక్, వంశి, సిరిల్, సంతోష్, ఇర్ఫాన్, నరసింహ, గురు మహేష్, నరేంద్ర రెడ్డి, నరసింహ, చరణ్ లు ప్రతిభ కనబరిచారు. అండర్ 19 బాలికల విభాగంలో విద్యార్థినిలు బేబీ లక్ష్మి, స్రవంతి, మోహిత, కావ్య, మధులత, షాజిదా, సల్మా, నాగమల్లిక, గంగాలక్ష్మి, సాయి ధరణి, శివాని రెడ్డి, ఆదిలక్ష్మి, శృతి, నవీన లు ఈనెల 17న సత్యసాయి జిల్లా ధర్మవరంలో జరిగే జూనియర్ రాష్ట్రస్థాయి టార్గెట్ బాల్ పోటీలలో పాల్గొంటారని అనంత విద్యాసంస్థల అధినేత రామ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని పొందడమే కాకుండా భవిష్యత్తులో క్రీడాకారుల ఉజ్వల భవిష్యత్తుకు ఈ క్రీడలు ఎంతో తోడ్పడుతాయన్నారు. తమ కళాశాల విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో కూడా ఎప్పుడు ముందుంటారన్నారు. అనంతరం పోటీలకు ఎంపిక అయిన విద్యార్థిని విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలలో కూడా విజయం సాధించాలని ప్రోత్సహించారు.